కనులపండువగా దుర్గామాత శోభాయాత్ర

- ప్రత్యేక పూజలు, అన్నదానం
- ఆకట్టుకున్న బతుకమ్మ పాటలు, కోలాటం
- తిలకించేందుకు బారులు తీరిన భక్తులు

షాద్‌నగర్‌టౌన్ : అమ్మవారి శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 14 : విజయదశమి పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి అమ్మవారి శోభాయాత్రను ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షాద్‌నగర్‌లో దుర్గామాత శోభాయాత్ర కోలాటాలు, డీజేల మధ్య వైభవంగా సాగింది. శోభాయాత్రను తిలకించేందుకు బారులు తీరారు. శ్రీశివమారుతిగీతా అయ్యప్ప మందిరం ఆధ్వర్యంలో గుర్రపు వాహనం, విద్యుత్ దీపాల నడుమ అమ్మవారి శోభాయాత్రను నిర్వహించగా.. మహిళల కోలాటం అందరిని ఆకట్టుకున్నది.

ఫరూఖ్‌నగర్ మండలంలో..

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. గాంధీనగర్ కాలనీలో అమ్మవారికి అలకరించిన చీరలను లక్కీ డిప్ ద్వారా భక్తులకు అందజేశారు. అనంతరం మహిళల కోలాటాలు, బతుకమ్మ ఆటపాటల మధ్య అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

షాద్‌నగర్‌రూరల్ : అమ్మవారి చీరలను భక్తులకు అందజేస్తున్న మండప నిర్వాహకులు

పెద్దఅంబర్‌పేట : తట్టిఅన్నారంలో అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో మహిళలు

పెద్దఅంబర్‌పేట మండలంలో..

పెద్దఅంబర్‌పేట : ఆదివారం రాత్రి పెద్దఅంబర్‌పేట, పసుమాముల, తట్టిఅన్నారం తదితర ప్రాంతాల్లో దుర్గామాత నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారి చీర రూ.1,62,116

యాచారం : మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఓం యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత నిమజ్జన కార్యక్రమం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా కొనసాగింది. మాజీ సర్పంచ్ దేరంగుల రాజు, మాజీ ఉప సర్పంచ్ పోలెపల్లి వినోద్‌కుమార్ సమక్షంలో దుర్గామాత చీరను వేలంవేయగా.. రాబోతు యాదగిరి రూ.1,62,116లకు దక్కించుకున్నారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. మహిళల బతుకమ్మ, కోలాటం పాటలతో గ్రామం పులకించిపోయింది.

కడ్తాల్ : మండల పరిధిలోని ఏక్వాయిపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిపిన వేలం పాటలో అమ్మవారి ముక్కుపుడకను రూ.లక్షా31వేలకు బత్తుల ఆంజనేయులుగౌడ్, లడ్డూను పాలకూర్ల యాదయ్యగౌడ్ రూ.85వేలకు, అమ్మవారి దండను రూ.50వేలకు పుట్టి మల్లేశ్‌గౌడ్, పెద్ద చీరను ఈర్లపల్లి లక్ష్మణ్ రూ.31వేలకు, చిన్న చీరను వడాల బాలరాజు రూ.24వేలకు దక్కించుకున్నారు. అనంతరం అమ్మ వారిని గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ ఎంపీటీసీ ఉమావతి, మాజీ సర్పంచ్ నర్సింహ, మాజీ ఉప సర్పంచ్ శంకరయ్య, నాయకులున్నారు.

కడ్తాల్ మండలంలో..



యాచారం : అమ్మవారి చీరను వేలంపాటలో రూ.1,62,116లకు దక్కించుకున్న యాదగిరి



కడ్తాల్ : దుర్గామాత నిమజ్జనంలో పాల్గొన్న నాయకులు, ఏక్వాయిపల్లి గ్రామస్తులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్, అక్టోబర్ 14 : రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై జరిగింది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి(55) మొయినాబాద్ సమీపంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలయ్యాడు. రెండు రోజులుగా ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రెండు గ్యాంగ్‌ల మధ్య ఘర్షణ

ఇద్దరికి గాయాలు

కొత్తూరు : దుర్గామాత నిమజ్జనంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు కథనం ప్రకారం.. కొత్తూరు మున్సిపాలిటీ పాత కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనం ఆదివారం రాత్రి నిర్వహించారు. నిమజ్జనంలో జంగగళ్ల అనిల్ గ్యాంగ్, కర్రోళ్ల సురేందర్ గ్యాంగ్ మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో అనిల్ కాలుకు గాయం కాగా.. సురేందర్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ఈ గొడవలో పాల్గొన్న సుదర్శన్, నవీన్‌చారి, పిపక్‌చారి, వెంకన్నచారి, కమ్మరి సాయి, బండి సాయి, జంగగళ్ల చందు, రాఘవేందర్, బండి కృష్ణ, గణేశ్, జంగగళ్ల అనిల్ లపై ఇరు వర్గాల వారు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

పశువైద్యాధికారులు అహ్మద్, దేవిరెడ్డి

మొయినాబాద్, అక్టోబర్ 14 : నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మొయినాబాద్ పశువైద్యాధికారి అహ్మద్, అమ్డాపూర్ డాక్టర్ దేవిరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో సోమవారం పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి నవంబర్ 11 వరకు ఈ కార్యక్రమం ఉండనుందని చెప్పారు. 15న సురంగల్, పెద్దమంగళారం, అజీజ్‌నగర్, చిలుకూరు, కనకమామిడి, అమ్డాపూర్., 16న పెద్దమంగళారం, సురంగల్, అజీజ్‌నగర్, చిలుకూరు, కనకమామిడి, అమ్డాపూర్., 17న చిలుకూరు, కనకమామిడి, సురంగల్, పెద్దమంగళారం, అజీజ్‌నగర్., 18న ఎల్కగూడ, అజీజ్‌నగర్, చిన్నషాపూర్, సురంగల్, చిలుకూరు, అమ్డాపూర్., 19న ఎన్కేపల్లి, అప్పోజిగూడ, శ్రీరాంనగర్, సురంగల్, ఎల్కగూడ, సురంగల్, కాశీంబౌలి., 21న ముర్తుజాగూడ, ఎల్కగూడ, ఎన్కేపల్లి, అప్పోజిగూడ, నక్కలపల్లి, కనకమామిడి, కాశీంబౌలి., 22న చిన్నమంగళారం, ముర్తుజాగూడ, రెడ్డిపల్లి, ఎన్కేపల్లి, కాశీంబౌలి, నక్కలపల్లి., 23న ఎన్కేపల్లి, చిన్నమంగళారం ముర్తుజాగూడ, రెడ్డిపల్లి, కేతిరెడ్డిపల్లి, కాశీంబౌలి., 24న ముర్తుజాగూడ, చిన్నమంగళారం, ఎన్కేపల్లి, కేతిరెడ్డిపల్లి, రెడ్డిపల్లి, బాకారం., 25న బాకారం, మొయినాబాద్, చిన్నమంగళారం, నాగిరెడ్డిగూడ, మోత్కుపల్లి, కేతిరెడ్డిపల్లి., 26న మొయినాబాద్, చిన్నమంగళారం, మోత్కుపల్లి, నాగిరెడ్డిగూడ, ఎతుబార్‌పల్లి, బాకారం., 28న మేడిపల్లి, మొయినాబాద్, నాగిరెడ్డిగూడ, ఎతుబార్‌పల్లి, మోత్కుపల్లి., 29న మొయినాబాద్, మేడిపల్లి, నాగిరెడ్డిగూడ, చందానగర్, బాకారం, ఎతుబార్‌పల్లి., 30న అమీర్‌గూడ, మేడిపల్లి, నాగిరెడ్డిగూడ, తోలుకట్టా, చందానగర్, నజీబ్‌నగర్., నవంబర్ 1న కుతుబుద్దీన్‌గూడ, అమీర్‌గూడ, జీవన్‌గూడ, హిమాయత్‌నగర్, నజీబ్‌నగర్, తోలుకట్టా., 2న జీవన్‌గూడ, కుతుబుద్దీన్‌గూడ, హిమాయత్‌నగర్, చాకలిగూడ, నజీబ్‌నగర్., 4న అమీర్‌గూడ, జీవన్‌గూడ, కుతుబుద్దీన్‌గూడ, హిమాయత్‌నగర్, చాకలిగూడ, నజీబ్‌నగర్., 5న వీరన్నపేట, బంగాలిగూడ, అప్పారెడ్డిగూడ, ఆయా గ్రామాల్లో మిగిలిపోయిన పశువులకు., 6న అప్పారెడ్డిగూడ, బంగాలిగూడ, వీరన్నపేట., 7, 8 తేదీల్లో వెంకటాపూర్ గ్రామంలో టీకాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.అన్ని గ్రామాల్లో టీకాలు వేయగా మిగిలిపోయిన పశువులుంటే 11, 12, 13, 14 తేదీల్లో టీకాలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

షాబాద్ మండలంలో..

షాబాద్ : మంగళవారం నుంచి నవంబర్ 14 వరకు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు మండలంలోని 41 గ్రామపంచాయతీల్లో షెడ్యూల్ ప్రకారం క్యాంపులు నిర్వహించి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని వారు కోరారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు : మంగళవారం నుంచి నవంబర్ 14 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని పాడి పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి చింతోజ్ అగ్నివేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకడం వల్ల వాటి నోట్లో, కడుపులో, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి తీవ్ర జ్వరం.. నడవలేకపోవడం, పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు.

కొత్తూరు మండలం, మున్సిపాలిటీలో..

కొత్తూరు, అక్టోబర్ 14 : పాడిపశువులకు కొత్తూరు మండలం, మున్సిపాలిటీలో మంగళవారం నుంచి గాలికుంటు వ్యాధి టీకా వేస్తామని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ పశువులకు నీజనల్ వ్యాధులు రాకుండా ఎఫ్ ఎండీ వ్యాక్సినేషన్ వేయించాలని ఆమె సూచించారు. రేపటి నుంచి ఈ నెల 30 వరకు కొత్తూరు మున్సిపాలిటీలో, 31 నుంచి నవంబర్ 14 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతుందని వివరించారు.

లెప్రసీ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 14 : శారద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట శాంతినగర్‌కాలనీ, సంతోష్‌నగర్ కాలనీల్లో 50 లెప్రసీ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

లెప్రసీ బాధితులకు సాయం అందజేస్తున్న శారద సేవా ట్రస్ట్ ప్రతినిధులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కడ్తాల్ (తలకొండపల్లి), అక్టోబర్ 14 : తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన చౌటి సాయమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు సోమవారం సాయమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.3వేలు, బీజేపీ నాయకులు రూ.3వేలు, కాంగ్రెస్ నాయకులు రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య, నాయకులున్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

కానమోని యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

యాచారం, అక్టోబర్ 14 : రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని మాల్ గ్రామంలో సీపీఎం గ్రామశాఖ సభను సోమవారం నిర్వహించారు. మాల్ మార్కెట్‌లో ఎర్ర జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు కానమోని యాదయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు మినహా మిగతా గ్యారెంటీలకు దిక్కులేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 వెంటనే అమలు చేయాలన్నారు. 2లక్షలలోపు రుణమాఫీ అర్హులందరికీ అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. రైతులకు రైతు భరోసా డబ్బులను ఖాతాల్లో జమచేయాలని కోరారు.

ధరణి పెండింగ్ భూ సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్లు వృద్ధులకు రూ.4016, దివ్యాంగులకు రూ.6016 అందించాలన్నారు. నిరుపేదలకు పునరావాసం కల్పించిన తరువాతే హైడ్రా ఇండ్లను కూల్చివేయాలన్నారు. ఫార్మాసిటీని మండలంలో ఏర్పాటు చేయొద్దని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తున్నదన్నారు. మోదీ హయాంలో దళితులపై దాడులు, అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి అదానీ, అంబానీలాంటి పెద్దలకు కొమ్ముకాస్తున్నదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామన్నారు. అనంతరం మాల్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బట్టు సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులున్నారు.

మాలలు ఐక్యం కావాలి



మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న మాల ఐక్యవేదిక నాయకులు

యాచారం, అక్టోబర్ 14 : న్యాయపరమైన రిజర్వేషన్లు సాధించుకునేందుకు మాలలంతా ఐక్యం కావాలని ఇబ్రహీంపట్నం మాల ఐక్యవేదిక కన్వీనర్ మారయ్య పిలుపునిచ్చారు. మండలంలోని నందివనపర్తిలో మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జైభీమ్ యూత్ అసోసియేషన్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మాల మాదిగల మధ్య రిజర్వేషన్ చిచ్చుపెట్టి వర్గీకరణను ప్రేరేపించడం సరికాదన్నారు. ఎస్సీ రిజర్వేషన్ న్యాయమైన చర్య కాదన్నారు. దళితులను విడగొట్టి పాలించడం కోసం మోదీ కుట్రపన్నినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో ఉద్యోగాల్లోనే కాకుండా చదువు, ఆర్థిక వనరులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజకీయాల్లో తీరని అన్యాయం జరుగనుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. మాలల హక్కులను సాధించుకునేందుకు తిరుగుబాటు చేసేందుకు సమయమాసన్నమైందన్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల ఐక్య వేదిక నాయకులున్నారు.

పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం



పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కడ్తాల్ (తలకొండపల్లి) అక్టోబర్ 14 : తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామం శ్రీభక్త మార్కండేయ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా కుక్కుడాల మల్లేశ్, ఉపాధ్యక్షులుగా ఏలే రమేశ్, కాడిగే మధు, పలాటి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కాడిగే నరేశ్, కోశాధికారిగా మాకం గణేశ్, సహాయ కార్యదర్శులుగా కాడిగే రాకేశ్, కాడిగే శశికుమార్, ముఖ్య సలహాదారులుగా మాకం పాండయ్య, మాకం జనార్దన్, గౌరవాధ్యక్షులుగా కాడిగే చంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా ఏర్వ రాజలింగం, మాకం నరసింహులు, కార్యవర్గ సభ్యులుగా మాకం రఘు, కాడిగే రమేశ్, రాజేశ్, గాజుల ప్రవీణ్, ఏరువ నరేశ్, మాకం ప్రమోద్, కాడిగే శ్రీకాంత్, భీమనపల్లి కిశోర్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాజా మాజీ వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి - అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 14

యువకుడిపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

మాడుగుల పోలీస్ స్టేషన్ ఆవరణలో ముదిరాజ్ సంఘం నాయకులు

మాడుగుల, అక్టోబర్ 14 : మండల పరిధిలోని నల్లచెరువు గ్రామానికి చెందిన రాశిక మహేశ్‌ముదిరాజ్ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన వడ్డేపల్లి కుటుంబసభ్యులైన శ్రీను, శివ, అఖిల్, కిరణ్, బాలకృష్ణ, వంశీ, మల్లేశ్, శివ పాత కక్షలు మనసులో పెట్టుకున్నారు. ద్విచక్ర వాహనంపై మాడుగుల వెళ్తున్న మహేశ్‌పై మార్గమధ్యంలో కాపుకాసి కర్రలు, రాళ్లతో పత్తి చేనులో పడేసి విపరీతంగా గాయపరిచారు. ఈ దాడిని కొంతమంది అదే గ్రామానికి చెందిన వారు చూడటంతో దుండగులు పరారైపోయారు. దుండగులను అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాధు చేశారు. ఈ సంఘటన తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు కట్ట జగన్ మాదిగ బాధితుడు మహేశ్‌కు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పది రూపాయల నాణేలు చెల్లుబాటవుతాయి

మన్సూరాబాద్ : పది రూపాయల నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్బీనగర్ బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలోని ఎల్బీనగర్ బ్రాంచ్‌కు విచ్చేసిన ఆయన ఖాతాదారులకు పది రూపాయల నాణేలను అందజేశారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు నాణేల చెల్లుబాటుపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణేలు వినియోగంలో ఉన్నాయని.. ఎవరైనా నాణేలు తీసుకోనట్లయితే సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. నాణేలను నిర్భయంగా తీసుకుని వాడవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నరేందర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఒక్క ఇటుకనూ కూల్చనివ్వం

మూసీ బాధితులకు అండగా ఉంటాం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఫణిగిరి కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 14: మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇండ్లకు సంబంధించిన ఒక్క ఇటుకనూ కూల్చనివ్వబోమని, మూసీ బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మూసీ ప్రాంతంలోని చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీలోని నివాసాలను అధికారులు కూల్చివేస్తారంటూ ఓ చానల్‌లో వార్త ప్రసారం కావడంతో భయాందోళనకు గురైన కాలనీవాసులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వివరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతంలోని నివాసితులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, నాయకులు పవన్, కడియం మోహన్‌రాజ్, కాలనీవాసులు వేణుగోపాల్, వీరాచారి, జ్యోతి, ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రజలకు కష్టాలు



తనపై రూపొందించిన పాట విడుదల కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ యువ నాయకుడు పటోళ్ల కార్తీక్‌రెడ్డి, అప్పారెడ్డి ముఖేశ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 14 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అత్తాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ ఆధ్వర్యంలో కార్తీక్‌రెడ్డిపై రూపొందించిన పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి యువకుల మద్దతు రోజురోజుకూ పెరుగుతున్నదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజలు కష్టాలు పడుతుంటే సీఎం చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని.. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్ మాట్లాడుతూ.. కార్తీక్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో పాటను రూపొందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రామూయాదవ్, రఘు, అశోక్ యాదవ్, శ్రీపాల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

పూజితను అభినందిస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, అక్టోబర్ 14: క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి తగిన విధంగా వారికి ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. జాతీయ యోగాసన పోటీలకు ఎంపికైన చిన్నారి పూజితను సోమవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సన్మానించారు.

అనంతరం ఉప్పల ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆమెకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూజిత జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరుస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.